క్లుప్తంగా

వర్షానికి తడిసిన ధాన్యం



నెరవాడ మెట్ట వద్ద తడిసిన మొక్కజొన్న

పాణ్యం: మండలంలో అయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు కల్లాలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే క్రమంలో వర్షాలకు తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు వడ్డిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: పౌష్టికాహారంతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఓర్వకల్లు జెడ్పీ హెచ్ హైస్కూల్, స్థానిక మోడల్ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, పిల్లలకు పాఠశాల దశ నుంచే సమతుల ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థి కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు సంజీవరాజు, యూసఫ్, ఆనంద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీబీ నిర్ధారణ పరీక్షలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో శుక్రవారం క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర తెలిపారు. 60 సంవత్సరాల పైబడి వయస్సు ఉండి, బీపీ, సుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్నవారికి గళ్ల పరీక్షలను నిర్వహించి, టీబీని నిర్ధారించడం జరుగుతుందన్నారు.

పాఠశాలల నిర్వహణపై శ్రద్ధ వహించాలి



సి.బెళగల్లోని స్పెషల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: పాఠశాల నిర్వహణపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. గురువారం ఆమె సి.బెళగల్లోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల నమోదు, హాజరు, తదితర అశాలను హెచ్‌ఎం ఈడీ సరోజమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు.

14 నుంచి ఒలింపిక్స్ డే వేడుకలు

కర్నూలు (టౌన్): ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఒలింపిక్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. చెస్, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, తైక్వాండో, కరాటే, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, జుడో, షూటింగ్ బాల్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, సిలంబం, కబడ్డీ, యోగాసన, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, త్రో బాల్ స్కే మార్షల్ ఆర్ట్స్, వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా క్రీడాంశాలకు సంబంధించి క్రీడాకారులు తమ పేర్లను క్రీడా సంఘాల ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 99081 96883 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యానికి దివ్యౌషధం యోగా

కర్నూలు కల్చరల్: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందానికి యోగా ఎంతగానో సహకరిస్తుందని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు అన్నారు. యోగాంధ్రలో భాగంగా గురువారం వర్సిటీ ఇండోర్ స్టేడియంలో యోగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ శిక్షకులు జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.శ్రీనివాసమూర్తి యోగా ప్రాధాన్యతను వివరించారు. వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, యోగా కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల స్వాగతం.. అవస్థల పాఠం !

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు చేరువ చేసింది. సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు అందించి, పేద పిల్లలు చక్కగా బడికొచ్చేలా చేసింది. వసతుల నుంచి విద్యాబోధనలో మార్పులు తీసుకొచ్చింది. అయితే నేటి కూటమి ప్రభుత్వ పాలనలో బడులకు 'చంద్ర'గ్రహణం పట్టుకుంది. వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభమైన పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికాయి. మొదటి పాఠం కష్టాలు.. అవస్థలు అన్నట్లుగా సాగింది.

ఎవరూ రాలేదు!



చిత్రంలో కనిపిస్తున్నది గడివేముల జెడ్పీ పాఠశాలలోని 8వ తరగతి గది. 430 మందికి గాను.. 40 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. విద్యా కానుక కూడా పంపిణీ చేయడం లేదని తెలుసుకుని ఎవరూ రాలేదు. కలెక్టర్ చేత పంపిణీ చేయాలని నిలిపినట్లు తెలుస్తోంది

- మొదటి రోజు మోగిన కష్టాల బెల్
- పాఠశాల ప్రాంగణాల్లో అపరిశుభ్రత
- అసంపూర్తి గదుల్లోనే తరగతుల నిర్వహణ
- విద్యార్థులకు అందని కిట్లు



కుళాయిలు లేని దృశ్యం

గడివేముల: గతంలో పాఠశాలల పునఃప్రారంభమంటే పండుగలా సాగేది. ఆనందంగా బడికెళ్లి జగనన్న కిట్లతో ఇంటికి చేరుకునేవారు. బడులు తోరణాలు, ఫ్లెక్సీలు కట్టి స్వాగతాలు పలికేవి. ఇలాంటి దృశ్యాలు నేడు ఎక్కడా కనిపించలేదు. కొన్ని చోట్ల కిట్లు ఇవ్వడం లేదని, పాఠశాలలు శుభ్రం కాలేదని అధిక సంఖ్యలో విద్యార్థులు బడి బాట పట్టలేదు. మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 2,500 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. కాగా తొలి రోజు ఒక్కో బడిలో 10 నుంచి 20 మంది విద్యార్థులకు మించి రాలేదు.



గడివేముల పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

పాణ్యం: తొలి రోజు పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు వర్షం కారణంగా పలు చోట్ల బురద స్వాగతం లభించింది. పలు పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అవస్థలు పడ్డారు. బపలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మినరల్‌వాటర్ ప్లాంట్‌కు నిరుపయోగంగా కనిపించింది. నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంఈఓ–2సుబ్రమణ్యం విద్యార్థులకు కిట్లు అందించారు. కిట్‌లో యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, నోట్ బుక్, పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. అయితే విద్యార్థులకు ఇంత వరకు షూ రాలేదు.



బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు

మళ్లీ అవే కష్టాలు



బాలికల హాస్టల్ వద్ద కూలిన ప్రహరీ

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునఃప్రారంభం రోజున పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. పాఠశాల భవనంపై నూతనంగా నిర్మిస్తున్న రెండు గదులు స్లాబ్ దశలో నిలిచిపోయాయి. ఈ గదులకు పీఎంశ్రీ కింద సుమారు రూ.23.70 లక్షలకు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటి వరకు రూ.18.5 లక్షలు మంజూరు చేశారు. దీంతో కంప్యూటర్ ల్యాబ్, సైన్సు ల్యాబ్‌ల కోసం నిర్మిస్తున్న గదులు అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే పాఠశాల చుట్టూ నిర్మించిన ప్రహరీ గత ఏడాది బాలికల వసతి గృహం దగ్గర కొంత భాగం కూలింది. ఏడాది కావస్తున్నా ఇంత వరకు నిర్మించలేదు.



అర్ధాంతరంగా నిలిచిన అదనపు గదుల నిర్మాణం

హాజరు అంతంత మాత్రమే!

కోడుమూరు రూరల్: వేసవి సెలవులనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం అంతంత మాత్రగానే కనిపించింది. ఏ ప్రభుత్వ పాఠశాలలో కూడా 10 శాతానికి మించి విద్యార్థులు హాజరు కాలేదు. దీంతో మొదటి రోజు కేవలం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. జగనన్న ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే ఇచ్చే స్టూడెంట్ కిట్ల పంపిణీ సందడి ఎక్కడా కనిపించలేదు. ఇప్పటి వరకు ఆయా పాఠశాలల విద్యార్థులకు సంబంధించి పుస్తకాలను మాత్రమే ప్రభుత్వం పూర్తిగా సరఫరా చేయగా, యూనిఫాం, స్కూల్ బ్యాగులు, షూ వంటి వాటిని ఇంకా కొన్ని పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేయలేక పోయింది. మొదటి రోజు కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో మొత్తం 130 ప్రభుత్వ పాఠశాలల్లో 23,524 మంది విద్యార్థులకుగాను కేవలం 4,682 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.



కోడుమూరు బాలుర హైస్కూల్లో తక్కువగా ఉన్న విద్యార్థుల హాజరు శాతం

రోడ్డు మీద బడి

సి.బెళగల్: ఇనగండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పాఠశాలలో 172 మంది విద్యార్థులు ఉన్నారు. కనీసం ప్రార్థన చేసేందుకు కూడా స్థలం లేదు. ప్రతిరోజు పాఠశాల ముందు రోడ్డుపైనే విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రార్థన నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు, వంట గది సైతం రోడ్డు పక్కనే ఉన్నాయి. ఇక ఆట స్థలం మాటే లేదు. కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు నేడు రెండవ విడతలో భాగంగా గ్రామ శివారులోని రూ.1.38 కోట్లతో అదనపు గదులు, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు అన్నీ బేస్‌మట్టం స్థాయిలోనే నిలిచి పోయాయి. ఈ ఏడాది కూడా అరకొర వసతుల మధ్య చదువులు కొనసాగించాల్సి వస్తోంది.



సి.బెళగల్ ఇనగండ్ల గ్రామంలో రోడ్డుపైనే ప్రార్థన చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

చంద్రబాబువన్నీ అబద్ధాలే

- ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఏడాది పాలనలో ఆయన ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం విమర్శించారు. గురువారం నగరంలోని ప్రకాష్‌నగర్, ధర్మపేట, కారల్‌మార్క్స్ నగర్, జనార్ధనరావు నగర్, చదువుల రామయ్య నగర్, బద్రీనాథ్ నగర్‌లకు సంబంధించి సంయుక్త మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో అరచేతిలో వైకుంఠం చూపి ఇప్పుడు డబ్బులు లేని చెప్పడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సొంతిల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని చెప్పి మాట తప్పిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కర్నూలు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచాలని, రోడ్లను విస్తరించాలని, పేద, మధ్య తరగతి వర్గాల కోసం నిర్మించిన టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం ఆయా శాఖల సెక్రటరీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నల్లన్న, రంగన్న, నాగరత్నమ్మ, ధర్మన్న, ఖాదర్‌బాషా, కుమార్‌రాజా, దంబోళం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.జగన్నాథం

మళ్లీ మురుగు సమస్య

కర్నూలు (టౌన్): నగరంలోని అశోక్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వర్షపు నీరు భారీగా చేరుకొని స్థానిక వాసులు, వాహనాదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్య చాలా కాలంగా ఉంది. దీనిపై స్పందించిన మంత్రి టీజీ భరత్ రూ.25 లక్షలు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. అయితే సకాలంలో పూర్తి కాకపోవడంతో పాటు పనుల్లో జాప్యం జరుగుతోందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మళ్లీ అదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడంతో మంత్రి కమిషనర్ రవీంద్రబాబుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనులను పరిశీలించిన కమిషనర్

మంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడంతో స్పందించిన కమిషనర్ రవీంద్రబాబు గురువారం సాయంత్రం డీఈఈ, ఏఈఈ, కాంట్రాక్టర్‌తో కలిసి పనులను పరిశీలించారు. అత్యవసర పనిగా భావించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షపు నీటిని మోటార్ల ద్వారా తొలగించారు. నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని, సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా పనులు చేపట్టినట్లు కమిషనర్ వెల్లడించారు. పనులు పూర్తయ్యే కాలనీవాసులు సహకరించాలని కోరారు. అయితే ఇక్కడి వారు మురుగు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, వాటిని తొలగించడంలో, నోటీసులు ఇవ్వడంలో పట్టణ ప్రణాళిక విభాగం స్పందించకపోవడంతోనే ఈ సమస్య వస్తోందన్న విమర్శలు ఉన్నాయి.



అశోక్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

బదిలీ మార్గదర్శకాలు విడుదలయ్యేనా?

- తీవ్ర నిరాశలో రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అన్ని శాఖల్లో సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తైనా రిజిస్ట్రేషన్ శాఖలో మాత్రం బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటివరకు బదిలీల మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో ఆ శాఖ ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అన్న ఆలోచనలో పడిపోయారు. మొదట జూన్ 9న బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు వస్తాయని చెప్పినా విడుదల కాలేదు. తిరిగి జూన్ 13న మార్గదర్శకాలు విడులవుతాయన్న ఆశతో ఉన్నారు. అయితే ఏమి జరుగుతుందో తెలియకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. మరో వైపు బదిలీలు జరిగితే సొంత ప్రాంతాలు, అనారోగ్యం బారిన పడిన వారు కుటుంబాలకు దగ్గర అవ్వడం, వేర్వేరు చోట్లా ఉద్యోగాలు చేస్తున్న భార్యభర్తలు ఒకచోటికి చేరడం, దూరప్రాంతాల్లో ఉన్న వారు సొంతూర్లకు దగ్గరగా వెళ్లడం కోసం మార్గదర్శకాలు వస్తే దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే మార్గదర్శకాల విడుదలపైనే మీమాంస నెలకొనడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

షుగర్ వ్యాధిపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): ఆధునిక సమాజంలో ప్రతి ఇంట్లో ఒకరికి షుగర్ ఉంటోందని, ఈ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకోవాలని కన్సల్టెంట్ డయాబెటాలజిస్టు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సి.గోపీనాథ్ రెడ్డి చెప్పారు. జాతీయ మధుమేహ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల కలిగే మెటబాలిక్ వ్యాధి ఇది అని తెలిపారు. ఆరోగ్య రంగానికి ఈ వ్యాధి పెనుసవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. కుటుంబంలో ఎవ్వరికైనా వ్యాధి ఉండటం, వయస్సు పెరుగుదల, అధిక బరువు, జీవనశైలిలో మార్పులు, పౌష్టికాహారం లేకపోవడం, పొగతాగే అలవాటు, మద్యపానం ఈ వ్యాధికి కారణాలని తెలిపారు. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెప్పారు.

123 మంది ఏఏఓలు, ఎస్‌ఏలు బదిలీ

కర్నూలు (అగ్రికల్చర్): స్టేట్ ఆడిట్ (లోకల్ ఫండ్) నాల్గవ జోన్ పరిధిలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. స్టేట్ ఆడిట్ కర్నూలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. కర్నూలు ఆర్‌డీడీ పరిధిలో 8 జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాలకు సంబంధించి 123 మంది అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు (ఏఏఓ), సీనియర్ ఆడిటర్లు (ఎస్‌ఏలు) బదిలీ అయ్యారు. బదిలీలను ఆర్థిక శాఖ అధికారి చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టారు. 23 మంది అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు, 90 మంది సీనియర్ ఆడిటర్లు బదిలీ అయ్యారు. ఐదేళ్లు నిండిన వారందరూ బదిలీ కాగా రిక్వెస్ట్‌పై మరికొందరిని వారు ఆప్షన్ ఇచ్చిన ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియను మార్గదర్శకాలకు లోబడి పూర్తి చేసినట్లు ఆర్‌డీడీ గోవిందప్ప పేర్కొన్నారు.

జారితే అంతే!

భూపనపాడు బీసీ కాలనీలో బురదయమైన రహదారి



మట్టి రోడ్లు చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వడ్డుగండ్ల–రసూల్లపేట గ్రామాల మధ్య ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూపనపాడు గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డు మొత్తం వర్షపునీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

– పాణ్యం

కోడుమూరులో భారీ వర్షం

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభ వేళ కోడుమూరులో వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా కోడుమూరులో 79.4 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెలవారుజామున వరకు ఏకదాటిగా భారీ వర్షం కురియడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి పొలాలన్ని తడిసి ముద్దయ్యాయి. ఏ పొలంలో చూసిన వాననీరు నిలిచిపోయిన దృశ్యాలే కన్పించాయి. వేసవి అనంతరం మండలంలో భారీ వర్షం కురియడంతో కోడుమూరు హంద్రీనది జలకళను సంతరించుకుంది. భారీ వర్షం రాకతో రైతన్నలు ఖరీఫ్ కింద పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతుండగా, ఇప్పటికే సాగు చేసిన పత్తి పంటకు ప్రస్తుతం కురిసిన భారీ వర్షం వల్ల మేలు చేకూరిందని రైతులు తెలిపారు.

తుంగభద్రకు జలకళ

సి.బెళగల్: తుంగభద్ర నది పరీవాహక ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో నది జలకళ సంతరించుకుంది. నదిలో దాదాపు 3 వేల క్యూసెక్కులకు పైగా వర్షపునీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని గుండ్రేవుల గ్రామం దగ్గర వర్షపు నీరు నదిలో ప్రవహిస్తుండటంతో నదికి జలకళ సంతరించుకుంది. కాగా మండల పరిధిలోని తుంగభద్ర తీర ప్రాంత గ్రామాలల్లో రైతులు ముందు ఉల్లి, పల్లి పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మండలం వ్యాప్తంగా 56.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని మండల సహాయ గణాంక అధికారి (ఏఎస్‌ఓ) ఆదినారాయణ తెలిపారు.



కోడుమూరు గోకరమయ్య కట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక


రేషన్ సరుకుల పంపిణీని పర్యవేక్షించండి

సి.బెళగల్: చౌక దుకాణాల్లో రేషన్ సరుకులు పంపిణీని వీఆర్వోలు నిత్యం పర్యవేక్షించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం ఆమె తన కార్యాలయంలో డీటీ పురుషోత్తం, ఆర్‌ఐ తరుణ్‌తో కలిసి వీఆర్వోలు, మండలంలోని రేషన్ డీలర్లతో సరుకుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. డీలర్లు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంకాలం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పకుండా రేషన్ పంపిణీ దుకాణాల్లోనే లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేసేలా చూడాలన్నారు. అదేవిధంగా వచ్చే నెలలో సైతం 65 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల దగ్గరే రేషన్ సరుకులను డీలర్లు అందించాలని ఆమె అన్నారు. సరుకుల పంపిణీలో అలసత్వం అహిస్తే యంత్రాంగంపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



సి.బెళగల్‌లో వీఆర్వోలు, డీలర్ల సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

గుంతలు ఇలా.. ప్రయాణం ఎలా!



గుంతలమయంగా ఉన్న కొత్రపాలూరు రోడ్డు

గుంతలమయమైన వెలుగోడు రస్తాలోని కొత్రపాలూరు రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుంతలమయమైన రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా బురదమయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షపునీరు గుంతల్లో నిలిచిపోవడంతో ఏది గొయ్యి.. ఏది రోడ్డు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా మంది కింద పడి ఆసుపత్రి పాలయ్యారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– గడివేముల